క్లుప్తంగా

కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

నర్సంపేట రూరల్ : పెరిగిన ధరలకు అనుగుణంగా గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలను పెంచాలని ఏఐఎఫ్‌డీఎస్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని మహేశ్వరం గ్రామంలో పట్టణ గురుకుల పాఠశాలను ఏఐఎఫ్‌డీఎస్, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నల్లబెల్లి : మండలంలోని పంతులుపల్లికి చెందిన గుండెబోయిన సురేందర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రుద్రగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వక్కల వెంకటేష్ బాధిత కుటుంబ సభ్యులకు చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఈ నగదును నాగరాజుపల్లి సర్పంచ్ గొనే శ్రీదేవి చేతుల మీదుగా శనివారం అందించి పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆసం చంద్రమౌళి, లావణ్య, వెంకటేష్, కిషోర్, దామోదర్, నూక గోవర్థన్, రవీందర్, రాజేందర్, యూత్ సభ్యులు సాయి, నరేష్, రాజు, వంశీ పాల్గొన్నారు.

కులవృత్తులకు పూర్వ వైభవం

రాయపర్తి : పంటల సాగుకు చెరువు నీరందిస్తే ఆయకట్టు రైతులు, ముదిరాజ్‌లు బహుళ ప్రయోజనాలు పొందుతారని మత్స్యకారుల సొసైటీ చైర్మన్ గూబ వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి శివారులోని మోదుగుల కుంటలో శనివారం మత్స్యకారులు చేపలు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు పూర్వవైభవం తెచ్చే క్రమంలో ముదిరాజ్‌లను ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు చేపపిల్లల ఉచిత పంపిణీ పథకం తమకెంతో దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమారస్వామి, వెంకన్న, సతీష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దామెర రాజేందర్ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీల నుంచి పొలిటికల్ సైన్స్‌లో డాక్టరేట్ పొందారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదలు పునరావాసం, జీహెచ్ఎంసీపై కేస్ స్టడీ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ సాధించినట్లు తెలిపారు. తాను పేదరికంలో జన్మించి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చదువును కొనసాగించానని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, శ్యామ్, మౌలాన్, రాజ్‌కుమార్, ప్రవీణ్, సునీత, హారిక, నవనీత, రవి, కవిత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పంది దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్ : పంది దాడి చేయడంతో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన నర్సంపేటలోని వరమ్మతోట శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సంగినేని వసంతకు చెందిన పాడిగేదెలు చీకటిపడిన కూడా ఇంటికి రాకపోవడంతో వాటి కోసం మల్లంపల్లి రోడ్డులోని వరమ్మతోట వైపు ఉన్న ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తోంది. దీంతో ఒక్కసారిగా పిల్లలతో ఉన్న పంది దాడి చేసింది. కాలనీ వాసులు కొట్టేందుకు ప్రయత్నించిన విడవకపోవడంతో పక్కనే పెద్ద రాయితో పందిని కొట్టడంతో విడిచిపెట్టింది. దీంతో వసంత చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గతంలో ఈప్రాంతంలో ఇప్పటి వరకు ముగ్గురిపై పంది దాడి చేసిందని, మున్సిపాలిటీ అధికారులు స్పందించడం లేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.

పనుల పరిశీలన

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో రూర్బన్ ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండి.సర్వర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. పనులు పూర్తైన వెంటనే వర్ధన్నపేట ఎమ్మెల్యేతో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



బీటీ రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు ఎమ్మెల్యే పెద్ది తదితరులు

దుగ్గొండి : నర్సంపేట నియోజవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పట్టుబట్టి రూ. 64కోట్లు మంజూరు చేయించుకున్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు, ఈ మేరకు మండలంలోని వెంకటాపురం టూ రాజేశ్వర్‌రావుపల్లి గ్రామాల మధ్య 6.30 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.41కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ మేరకు అభివృద్ధి పనులను మంత్రి శనివారం మహ్మదాపురంలో శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 70లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్ల నిర్మాణ పనులు ఇప్పటికే సాగుతున్నాయని, ఇంకా మిగిలిన రోడ్లకు సైతం నిధులు మంజూరు చేశామని త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, ఆర్డీఓ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, సర్పంచ్‌లు ఇంగోళి రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీలు చింత లావణ్య, కొల్లూరి విజయ, సుకినె రాజేశ్వర్‌రావు, ఊరటి మహిపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



గీసుకొండ: ధర్మారం నుంచి మోదీ సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు



వర్ధన్నపేటలో..

నర్సంపేట రూరల్ : నరేంద్ర మోదీ బహిరంగ సభకు నర్సంపేట మండలం నుంచి బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

గీసుకొండలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ సభకు బీజేపీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు గోదాసి అశ్విని, జాన్ విక్రం, బుట్టి కుమారస్వామి, మొలుగూరి శ్రీనివాస్, పగడాల రాజ్‌కుమార్, గట్టికొప్పుల రాంబాబు, కంది కాంత్రికుమార్, ముల్క ప్రసాద్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీజేపీ నాయకులు

వర్ధన్నపేట : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు మండల బీజేపీ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. జిల్లా నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జడ సతీష్, పంజా వేంకటేశ్వర్లు, కొండేటి సత్యం, మల్లెపాక అనిల్, అయిత రవి, పెద్దూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు బీజేపీ మండల నాయకులు శనివారం తరలివెళ్లారు. కన్వీనర్ దామరుప్పుల శేఖర్, మేడి సుధాకర్, లక్ష్మీనర్సయ్య, రాజు, సురేష్, కుమారస్వామి ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



నల్లబెల్లి : పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు హెచ్చరించారు. మండలంలోని రుద్రగూడెం, నల్లబెల్లి హైస్కూల్, నల్లబెల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం సందర్శించారు. విధుల్లో ఉన్న పోలీసులకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ సీఐ సూర్య ప్రసాద్, ఎస్సై సురేష్‌లతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

11న ఆత్మీయ సమ్మేళనం

ఐనవోలు : బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న సత్యం గార్డెన్‌లో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నందనం గ్రామంలో శంకర్‌రెడ్డి ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : టీడీపీ పట్టణ అధ్యక్షుడు, పట్టణ పద్మశాలీ సంఘం మాజీ కోశాధికారి బంక రవీందర్ (51) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా మృతదేహంపై నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అలాగే టీడీపీ మహబూబాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు కొండపల్లి రామచందర్‌రావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎండి.ఇమామ్, ప్రేమ్‌చంద్‌వ్యాస్, కారింగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

నర్సంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు బంక రవీందర్ శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు



ఖాదర్‌పేట శివారులో మట్టిని తవ్విన ప్రదేశం

- చోద్యం చూస్తున్న అధికారులు
- అధికారుల అండదండలతోనే మొరం దందా అంటున్న ప్రజలు

చెన్నారావుపేట : అనుమతి లేకుండానే యథేచ్ఛగా మొరం తోడేస్తున్నారు. అధికారులను వారి గుప్పిట్లో పెట్టుకుని విచ్చలవిడిగా మొరం విక్రయాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారని, వారి కనుసన్నలలోనే ఈ దందా సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

మండలంలోని పలు గ్రామాలలో పొక్లెయిన్ యజమానులు మధ్యవర్తుల ద్వారా మొరం దందాకు తెరలేపారు. యజమానితో ఒప్పందం చేసుకుని మొరం కావాల్సిన వ్యక్తులతో బేరసారాలు కుదుర్చుకుని ఒక ట్రాక్టర్ ట్రిప్పు మొరానికి రూ.600 నుంచి రూ.850వరకు వసూలు చేసి విక్రయిస్తున్నారు. రాత్రివేళ ఊరంతా నిశబ్దంగా నిద్రించే వేళ వీరి దందా ప్రారంభం అవుతుంది. ఇది రాత్రి వేళ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు కనిపించిన, స్థానిక రెవెన్యూ అధికారులు చూసిన పట్టించుకోరు. ఎందుకంటే బెదిరింపు కాల్స్ రావొచ్చు లేదంటే డబ్బుల ఎర చూపొచ్చు. దీంతో వారు ఏమి చేయకుండా, తెలియనట్టుగా ఉంటారు. అంతేకాక ఎవరైన సమాచారం అందిస్తే వెంటనే ఎవరు కాల్ చేసింది కూడా సదరు వ్యక్తికి సమాచారం అందిస్తారు. దీంతో మట్టి విక్రయదారుడు కాల్ చేసిన వ్యక్తితో గొడవకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టలను తవ్వేస్తుండటంతో పలువురు రెవెన్యూ, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమ దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం..



అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలించినట్లయితే పొక్లెయిన్‌లను సీజ్ చేస్తాం. మట్టి అవసరం ఉన్నవారు రెవెన్యూ, ఐబీ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే ట్రాక్టర్లు, యంత్రాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.

- తోట మహేందర్, ఎస్సై

కఠిన చర్యలు తీసుకుంటాం..



మట్టి తరలింపునకు మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరి. అనుమతులు లేకుండా మట్టి తరలించిన వారికి గతంలో కూడా జరిమానాలు విధించాం. మట్టి తరలిస్తే ఉపేక్షించేది లేదు. పోలీసులు మొరం తరలిస్తున్నట్లు కనిపిస్తే యంత్రాలను అదుపులోకి తీసుకోవాలి.

- బన్సిలాల్, తహసీల్దార్

అవకాశం కల్పించాలి

వర్ధన్నపేట : చట్టసభల్లో రజకులకు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రజక ఉద్యమ సమితి సభ్యుడు మునుకుంట్ల దేవేందర్ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులకు మద్దతిచ్చే పార్టీలకే రానున్న ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. చట్టసభల్లో రజకుల ప్రాతినిధ్యం లేకపోవడంతో తమ కష్టాలు వినిపించే గొంతుక లేదన్నారు. రాజకీయ పార్టీలు పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రజక ఉద్యమం చేపడుతామని ప్రకటనలో హెచ్చరించారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



నర్సంపేట: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



నల్లబెల్లి: మాట్లాడుతున్న నానబోయిన రాజారాం

నర్సంపేట : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు మరణం గెలిచి లేచాడని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈస్టర్ పండుగను(క్రీస్తు పునరుత్థాన) పురస్కరించుకొని పట్టణంతో పాటు పలు మండలాలకు చెందిన చర్చిల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని మతాలను గౌరవించుకోవడం మన సాంప్రదాయం అన్నారు. నియోజకవర్గ సంక్షేమం కోసం, తన కోసం నిత్యం దేవదేవునికి ప్రార్థించాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. క్రిస్టియన్ల కోసం కోటి రూపాయలతో కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, కౌన్సిలర్లు, రన్ ఫర్ జీసస్ నిర్వాహణ కమిటీ బాధ్యులు రెవ రూబెన్, ఎంఎస్ ప్రభాకర్, కోట డేవిడ్, గాదె ఇస్సాక్, అశోక్, ఎర్ర శ్రీకాంత్, కొమ్ముల నవీన్, కృపానవీన్, నల్ల రవిందర్, దినకర్, విజయ్, అశోక్, పార్టీ నాయకులు, నియోజకవర్గ చర్చి పాస్టర్లు, విశ్వాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

నల్లబెల్లి : శాంతి, ప్రేమ మార్గాన్ని అనుసరిస్తూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం అన్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానం దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లబెల్లి మండల పాస్టర్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో మండలంలోని నల్లబెల్లి, కొండాపూర్ గ్రామాల్లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం క్రైస్తవులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు నానబోయిన రాజారాం, గూబ తిరుపతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాలు ప్రధాన వీధులలో కొనసాగాయి. ఏసు క్రీస్తు సిలువ మరణ పునరుత్థానం సందేశాన్ని పాస్టర్స్ వినిపించారు. వందలాది మంది క్రైస్తవులు రోడ్డుపై పరిగెడుతూ రన్ ఫర్ జీసస్ జెండాలు ఊపుతూ 'ఏసు క్రీస్తు లేచెను, నిజముగా క్రీస్తు పునరుత్థానుడయ్యెను' అని ఉత్సాహంగా ఎలుగెత్తి చాటారు. ఏసుక్రీస్తు బోధనలు, క్రైస్తవులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ ప్రపంచానికి ఏసు చూపిన మార్గం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఈపీ ప్రసాద్, మత్తయ్య, సంఘ పెద్దలు ప్రకాశ్, ప్రభాకర్, నవీన్, సాగర్, అశోక్, రఘువరణ్, కరుణాకర్, సుందర్, శ్యామ్ బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలోకి ఇతరులు రావొద్దు

సీపీ ఏవీ రంగనాథ్



విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న రంగనాథ్

ఐనవోలు : పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధం లేని ఇతర వ్యక్తులు ఎవరిని పరీక్ష కేంద్రాలలోకి వెళ్లకుండా పోలీసులు పటిష్టంగా నిఘా పెట్టాలని వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. శనివారం పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్న మండలంలోని పున్నేలు ప్రభుత్వ పాఠశాల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును తెలుసుకున్నారు. పరీక్ష సెంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణతో పాటు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌ను సెంటర్‌లో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు, ఇబ్బందులు ఏమైనా పడుతున్నారా అని ఆరా తీశారు. అధికారులైనప్పటికీ సెల్‌ఫోన్ల తో పరీక్ష కేంద్రంలోకి అనుమతించ కూడదని చెప్పారు. బందోబస్తు ఏర్పాట్ల గురించి పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ పరిశీలనలో సీపీ వెంట ట్రైయినీ ఐపీఎస్ అంకిత్ కుమార్, ఎస్సై గుగులోత్ వెంకన్న పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



నర్సంపేట రూరల్: రాజపల్లిలో..



ఖానాపురం: బుధరావుపేటలో..



చెన్నారావుపేటలో..



నెక్కొండ: పెద్దకొర్పోలులో పోస్టుకార్డులు చూపుతున్న ఉపాధి కూలీలు, బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట రూరల్ : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. ఉపాధి పథకంలో కేంద్ర ప్రభుత్వం కోత విధించడాన్ని నిరసిస్తూ నర్సంపేట మండలంలో రాజపల్లి గ్రామంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని శనివారం ప్రారంభించారు. సర్పంచ్‌లు నామాల భాగ్యమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ నర్ర నాగరాజు, గుర్రాల రాఘవరెడ్డి, పొన్నం రమేష్, కుమారస్వామి, రాధిక, గ్రామ వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఖానాపురం : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరుతూ శనివారం మండలంలోని బుధరావుపేటలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వానికి పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని నిర్వహించగా ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ఏడాది ఉపాధి హామీ పథకానికి రూ.30వేల కోట్లు తక్కువగా కేటాయించిందని అన్నారు. దీంతో కూలీలకు పని దినాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో కనీస కూలీ రూ.257ఇవ్వాల్సి ఉన్నప్పటికి రూ.100కు మించి ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. పని ప్రదేశం కనీస సౌకర్యాలు కరువయ్యాయని చెప్పారు. ఉదయం 10గంటలకు, సాయంత్రం 4గంటలకు ఆన్‌లైన్ ఫొటో అప్డేట్ చేయాలనే నిబంధన పెట్టడంతో ఇంటర్నెట్ సిగ్నల్స్ లేని ప్రాంతంలో కూలీలు పనులకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కుంచారపు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాన్‌బీ, మౌలానా, గ్రామపార్టీ అధ్యక్షుడు యాకుబ్‌పాషా, రాజశేఖర్, మురళి, నాగరాజు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ఈజీఎస్ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని పోస్టుకార్డు ద్వారా మంత్రికి సందేశాన్ని శనివారం పంపించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రఫి, జక్క అశోక్, మురహరి రవి, జున్నూతుల రాంరెడ్డి, కంది కృష్ణచైతన్య, బుర్ర సుదర్శన్ గౌడ్, సర్పంచ్ లక్ష్మి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నెక్కొండ : ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఎంపీపీ జాటోత్ రమేష్‌నాయక్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో కేంద్ర జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పోస్టుకార్డుల ద్వారా సందేశం పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో రూ.30 వేల కోట్ల నిధులు తగ్గించడం, దీంతో ఉపాధి కూలీ పని దినాలు తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం 8గంటలు పని చేసిన కూలీలకు రూ.480 ఇవ్వాలని ఉన్నప్పటికి కూలీలకు కనీస వేతనం అందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహ్మద్ మైబూబ్‌పాష, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె వెంకన్న, ఎంపీటీసీ సుకన్య, ఉప సర్పంచ్ పరుపాటి ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ రాంచందర్, నాయకులు కుమారస్వామి, అనిత, వీరస్వామి, లక్ష్మణ్, కొమురయ్య, ముత్తయ్య, రాజు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఊడుగుల ప్రవీణ్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామం నుంచి పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు రూ.30 వేల కోట్ల నిధులు తగ్గించి ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతుందని విమర్శించారు. కార్యక్రమంలో నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు కొత్తపల్లి కోటిలింగాచారి, గందె శ్రీనివాస్ గుప్త, ఇంగ్లే శివాజీ, మామిండ్ల మోహన్ రెడ్డి, మంజిలాల్, పూల్‌సింగ్, దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట రూరల్ : మున్నూరుకాపు గురిజాల గ్రామ అధ్యక్షుడిగా దేవేందర్ పటేల్‌ను నియమించారు. ఉపాధ్యక్షులుగా పోశాల రాజమౌళి, మిట్టపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పోతు శంకర్, కోశాధికారిగా పసునూటి వెంకటేశ్వర్లు, సహయ కార్యదర్శిగా నాగిశెట్టి కొమురయ్య, కార్యవర్గ సభ్యులు పుప్పాల మధు, పోతు రాజమౌళి, మినుముల భిక్షపతి నియామకం అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దామెరశెట్టి ఉత్తరయ్య, నియోజకవర్గ కన్వీనర్ నాగిశెట్టి ప్రసాద్, నర్సంపేట మండల కోఆర్డినేటర్ కడారి కుమారస్వామి పాల్గొన్నారు.